సునాదమాల బామ్మని నమిలి మింగేసేలా చూసింది. 'ఛాలెంజి రాముడు' సినిమాకు వెళదామంటే, వద్దని ఇటు తీసుకువచ్చింది తను. తననో మోడరన్ గర్ల్‌గా చూపించడానికి బామ్మ పడే తాపత్రయం చూస్తుంటే బామ్మమీద కోపమూ, ఇష్టమూ కలుగుతున్నాయి ఆ అమ్మాయికి.

తెర వెనుకనుంచి వీళ్ళని చూసిన పద్మాకర్ విహారితో "కాబోయే అత్తాకోడళ్ళు బాగానే మాట్లాడుకుంటున్నారు గురూ" అని గుసగుస లాడాడు. విహారి నవ్వాడు. "ఇంకా ద్వాదశి వరకూ టైముందిగా?"

అదే సమయానికి - హాలు బయట రెండుకార్లు ఒకదానికొకటి ఎదురుగా వచ్చి ఆగాయి. ఒక దానిలోంచి పరమేశ్వరం, మరొక దాన్లోంచి ప్రవల్లిక దిగారు. ఒకర్నొకరు చూసుకుంటూ లోపలి ద్వారం దగ్గరకు ప్రవేశించారు. పరమేశ్వరం వ్యంగ్యపు మర్యాద నిండిన కంఠంతో - "వెళ్ళమ్మా! లేడీస్ ఫస్ట్" అన్నాడు.

"ముందు క్రిమినల్స్ నడుస్తూండగా వెనుక పోలీసులు రావడం మర్యాద" అందామె.

పరమేశ్వరం బిగ్గరగా నవ్వి - "ఈ ఒక్క మాటకే నీ మీద పది లక్షలకి పైగా పరువునష్టం దావా వెయ్యొచ్చు" అన్నాడు. ఆమె ముఖం తిప్పుకుని వడిగా లోపలికి వెళ్ళింది.

గ్రీన్ రూమ్‌లో విహారిని కలుసుకుని "సారీ అర్జెంట్ పని తగిలింది. వెళ్ళాను."

"అది చెప్పడానికి ఇంతదూరం వచ్చారా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ప్రోగ్రామ్‌కి మీరు రమ్మన్నారు. చూడలేకపోతున్నానని చెప్పాలిగా-"

"ఏమిటంత అర్జెంటు పని?"

ఆమె నవ్వి - "సి.బి.ఐ. పనులు చెప్పకూడదు?" అంది.

పక్కనే వున్న పద్మాకర్ "సి.బి.ఐ. అంటే గుర్తుకొచ్చింది. మీవన్నీ గవర్నమెంట్ పనులేనా? మాకూ కాస్త ప్రైవేట్ డిటెక్టివ్ పని చేసిపెడతారా?" అని అడిగాడు.

"మీకేం పని కావాలి?" నవ్వుతూనే అడిగింది.

"మాకో అమ్మాయి ఫోన్ చేస్తోంది. ఎదురుగ్గా ఉన్నప్పుడు ఏమీ ఎరగనట్టు ప్రవర్తిస్తుంది ఆ అమ్మాయిని పట్టుకోవాలి."

"ఎవరా అమ్మాయి? ప్రస్తుతం ఎక్కడుంది?" వాలుగా చూస్తూ అడిగింది.

"ప్రస్తుతం ఈ ఆడిటోరియంలోనే వుంది."

ప్రవల్లిక నవ్వాపుకుని టైమ్ చూసుకుని -- "మైగాడ్! టైమయింది వెళ్ళాలి. రేపు కలుస్తాను" అని వెళ్ళిపోయింది.

"ఆ అమ్మాయితో సునాదమాల సంగతి ఎందుకు చెప్పా ..... " అని విహారి అంటూండగా, ఇంతలో బెల్ మ్రోగింది. నాటకం తెర లేచింది.

లవకుశ ఆధునిక యక్షగానం ప్రారంభమైంది.

అందులో విహారిది సూత్రధారుడి పాత్ర. పైనుంచి స్పాట్ పడింది. పాత్రధారులందరూ

తల్లి గౌరవం నిలబెట్టిన సందర్భంలో .....

‘రఘుకులవతి వారసులై
యుద్ధభూమికే అధిపతులై
జననీ జనకుల సహగమనానికి
కారణభూతులు కుశలవులై ..... ’

స్పాట్‌లో నిలబడి వున్న విహారి దృష్టి ముందు వరుసలో కూర్చున్న పరమేశ్వరం మీద పడింది. అతడి స్మృతి పుటల్లో ఏవో కదలికలు ..... గుర్తుకొచ్చింది.

అంతే!

గొంతు తడబడింది.

చప్పున తల్లి కూర్చున్న వేపు చూశాడు.

అప్పుడే ఆమె దృష్టి కూడా అటు పడినట్టుంది. ఆమె కుర్చీలోంచి లేస్తోంది.

వెనుక తెరపడింది. ముందు స్పాట్‌లో అతను వుండిపోయాడు. జనంనుంచి కరతాళధ్వనులు. అతడు వాటిని వినడం లేదు తల్లినే చూస్తున్నాడు. పరమేశ్వరాన్ని చూసున్నాడు. పూజగదిలో ఫోటో అతని కళ్ళ ముందు కదలాడుతోంది.

ఈ వ్య క్తే ..... ఈ వ్య క్తే తన తండ్రి!

మరణించాడనుకున్న తన తండ్రి ..... బ్రతికే వున్నాడు!!

ఆ వ్య క్తి కూడా తల్లిని గుర్తించినట్టున్నాడు. ఇన్నాళ్ళ తర్వాత భర్తని కలిసిన ఆనందంలో తల్లి జనాన్ని మరచిపోయింది. విహారి గొంతులోంచి బయటకు రాబోయిన ‘నాన్న’ అనే పదాన్ని సంతోషం డామినేట్ చేసింది. వర్దని కొడుకు చేతులు పట్టుకుని - “ఒరేయ్! గుర్తు పట్టావురా?మీ నాన్నరా ..... మీ నాన్న” అంటూ ఏడ్చేసింది. పరమేశ్వరం ఆమె తలమీద ఆప్యాయంగా చేయివేసి నిమిరాడు. ఇన్నాళ్ళ తర్వాత వాళ్ళని కలిసిన ఆశ్చర్యం అతడి కళ్ళలో కనబడుతూంది. అయితే, తొందరలోనే అది సర్దుకుంది.

ఇంతలో విహారి తండ్రికి దగ్గరగా వెళ్ళాడు. పాతిక సంవత్సరాల తర్వాత కలిసిన తండ్రిని ఎలా సంబోధించాలో, ఏం మాట్లాడాలో కూడా తెలియడం లేదు. తల్లి నిజమైన ఆనందాన్ని ఇన్నాళ్ళ తర్వాత మొదటిసారి చూస్తున్నాడు.

ఓ ఇబ్బంది నుంచి తప్పించడానికా అన్నట్టు పరమేశ్వరమే మొదట చేయి సాచాడు. “పాతికేళ్ళ క్రితమైతే ‘బాబూ’ అని ఎత్తుకునే వాడిని. అడ్డాల్లో బిడ్డని ఇప్పుడు విధి గడ్డాల్లో పరిచయం చేస్తూంది. ఆశీర్వదించి ముద్దాడలేను. పరిచయం చేసుకుంటాను” అంటూ చేయి మరింత ముందుకు సాచాడు.

“నేను ..... నేను విహారిని నాన్నగారూ” అంటూ ఆ చేయి అందుకున్నాడు విహారి.

ఆ ‘షేక్ హేండ్’ వెచ్చగా వుంది.

# 13

విహారి అంత ఆనందంగా ఇంతకు ముందెన్నడూ లేడు. ఆ ఆనందం తండ్రి 'దొరకటం' వల్ల వచ్చింది కాదు. తల్లి ఆనందంగా వుండటాన్ని చూడటంవల్ల వచ్చింది అతడికి వూహ తెలిసిన తర్వాత తల్లి సంతోషాన్ని మొట్టమొదటిసారిగా నిజంగా చూస్తున్నాడు. అది అతనికెంతో సంతృప్తినిస్తోంది.

తన తండ్రి ఢిల్లీలో ప్రసిద్ధి చెందిన లాయరు అని తెలిసి అతడు మరింత గర్వించాడు. ఆ సంతోషంలో ప్రవల్లిక చెప్పిన లాయర్ ఇతడే అన్న విషయం మర్చిపోయాడు. అతడికి ప్రవల్లిక ఏ పేరు చెప్పిందో గుర్తులేదు. అనంతానంతస్వామి కేసుల్లో వాదించేది తన తండ్రే అన్న విషయం అతడికి తెలిసే అవకాశం ఆ రెండు రోజుల్లోనూ రాలేదు.

తండ్రి లభించిన సందర్భంగా అతడు హౌస్ - వార్మింగ్ పార్టీ ఇచ్చాడు. తన స్నేహితులకే కాక ఊళ్ళో చాలామంది ప్రముఖులు కూడా వచ్చారు. ఈ ఊళ్ళో కూడా తన తండ్రికున్న పలుకుబడిని చూసి అతడు ఆశ్చర్యపోయాడు.

"నాన్నగారూ! మీ ఫోటో ఒక్కసారయినా ఇటువేపు పేపర్లో వచ్చివుంటే - మీరు మాకెప్పుడో లభ్యమై వుండేవారు" అన్నాడు.

పరమేశ్వరం ఆప్యాయంగా నవ్వి, "ఫోటో చూసి గుర్తుపట్టేసే వాడివా?"

"గుర్తుపట్టలేక పోవటం ఏమిటి నాన్నగారూ? అమ్మ ప్రతిరోజు మీ ఫోటోకి దణ్ణం పెట్టిస్తుంది."

పరమేశ్వరం ఆశ్చర్యంగా, "ఇరవై అయిదు సంవత్సరాల్నుంచీ" అని ప్రశ్నించాడు.

"అవును. ప్రతిరోజూ ..... ఇరవై అయిదు సంవత్సరాల్నుంచీ ..... " అంటూ తల్లి వేపు చూశాడు. కాసింత సిగ్గు మిళితమైన స్వరంతో, వర్ధనమ్మ తనని తానే మందలించుకున్నట్టు, "ఎంత పాపిష్టి దాన్ని - ఫోటోకి దండ వేశాను" అంది. పరమేశ్వరం నవ్వుతూ ఆమె భుజం తట్టాడు.

విహారి తల్లివేపు చూశాడు.

ఈ 'బొట్టు అనే దాన్ని ఏ భారతీయుడు కనిపెట్టాడోగానీ అతడికి సహస్ర కోటి వందనములు సైన్స్ పెరిగేకొద్దీ రకరకాల లిప్‌స్టిక్స్, ఐ-లైనర్స్, క్రీమ్స్ కని పెట్టి. ప్రపంచపు స్త్రీలందర్నీ మరికాస్త అందగత్తెల్ని చేస్తే చేసి వుండొచ్చుగాక? ..... కానీ "బొట్టులా స్త్రీ ముఖానికి అందాన్నిచ్చేది గత పదివేల సంవత్సరాల్లో మరేదీ కనిపెట్టబడలేదు.

తల్లి నుదుటి మీద అది మరింత హుందాతనాన్ని సంతరించుకుని ప్రకాశిస్తూంది.

"నీ తప్పేముంది వర్ధనీ, తప్పంతా నాది! రైలు ఆక్సిడెంట్‌లో నెలరోజులు ఆస్పత్రిలో వుండి వస్తే ఇల్లు ఖాళీగా వుంది. మీ తండ్రిగారి దగ్గరికి వచ్చి వాకబు చెయ్యాలన్న ఆలోచన రాకపోవటం నాదీ తప్పు." అన్నాడు [illegible] పరమేశ్వరం

ఆ సంభాషణ అంతటితో ముగిసింది.

ఆ రాత్రి పన్నెండింటికి విహారి మంచినీళ్ళ కోసం ఫ్రిజ్ దగ్గరికివెళ్ళి వస్తూ, తెరచి వున్న కిటికీలోంచి లోపలికి చూశాడు. తండ్రి కాళ్ళ దగ్గిర తన తల్లి కూర్చుని కాళ్ళు వత్తుతూ కనిపించింది నీరసపు ఆస్తిత్వాన్ని ఆపాదించుకున్న రాత్రి తాలూకు ప్రశాంతతలో, ఆ దృశ్యం అతడికెంతో మనోహరంగా కనిపించింది. గ్రామపు పొలిమేరలో, గుడిసె ముంగిట్లో, రాట్నం ముందు కూర్చుని ఈ లోకపు బాధలలోనూ, వ్యధలతోనూ నిమిత్తం లేకుండా నూలువడికితే వృద్ధురాలి మొహంలో కనిపించే ఆనందాన్ని ఏ రచయిత వర్ణించగలడు? శబరి వణికే చేతులూ, జటాయువు విరిగిన రెక్కలు 'సేవ'లో వుండే ఆనందాన్ని తెలుపుతాయి. తనని తాను అర్పించుకోవటం ద్వారా స్త్రీ పొందే ఆనందానికి వయసుతో నిమిత్తంలేదు.

విహారి నిశ్శబ్దంగా అక్కడనుంచి కదిలాడు.

* * *

"ఎలా చెప్పను నాన్నా అతడికి? నేను ఉదాహరించిన ఢిల్లీ లాయర్ నీ తండ్రే అని విహారికి ఎలా చెప్పను? అతడి ఆనందాన్ని ఎలా పాడు చెయ్యను?" బాధగా అంది ప్రవల్లిక.

"వద్దమ్మా చెప్పకు. లాయర్‌గా అతడు చేసిన తప్పేమీ లేదు. మనకు చాలా పెద్ద తప్పుగా తోచింది. అవతలి వాళ్ళకు చాలా చిన్నదిగా తోచవచ్చు. అయినా మనకీ - స్వామీకీ మధ్య నున్నంత స్పర్థ విహారికీ - స్వామికీ మధ్య లేదు కదా. ఈనాటితో అదీ సమసిపోవచ్చు. లేదా, కొత్తగా వచ్చిన ఈ బంధాల వల్ల పరమేశ్వరమే అనంతానంతస్వామి నుంచి క్రమంగా దూరం కావొచ్చు. మనం తొందరపడి ఆ అబ్బాయికి ఏదైనా చెప్తే అతడు అపార్థం చేసుకునే ప్రమాదం వుంది."

"కానీ విహారికి ఎప్పుడో ఒకప్పుడు తన తండ్రే స్వామి కుడిభుజం, ఆ సుప్రీంకోర్టు లాయర్ అని తెలియక తప్పదు."

"తెలియనీ, కానీ మన ద్వారా వద్దు అంటున్నాను."

ప్రవల్లిక సమాధానం చెప్పలేదు. ఆమె మనసేమిటో కీడు శంకిస్తూంది. పరమేశ్వరం తెలివితేటలు ఆమెకు తెలుసు. తన సంసారం పట్ల అతడు చూపించేది నిజమయిన ప్రేమ అయిన పక్షంలో అంతకన్నా కావల్సిందేముంది?

ఆ ఆలోచనతో ఆమె మనసు తేలికయింది. తండ్రి చెప్పినట్టు తను అనవసరంగా ఎక్కువ ఊహిస్తూందేమో! భార్యాబిడ్డలంటే ఎవరికి ప్రేమ వుండదు?

కూతురి మౌనాన్ని ప్రతాపరావు ఇంకోలా అర్థం చేసుకున్నాడు.

"ఈ సమయంలో నేను వెళ్ళి సంబంధం మాట్లాడితే అంత బావోదనుకుంటానమ్మా. తన కొడుక్కి నిన్ను చేసుకోవటానికి అతడు నిరాకరించవచ్చు" అన్నాడు. ఆమె అసలు ఆ కోణంలో ఆలోచించలేదు. విహారి తండ్రెవరో తెలిసినప్పటి నుంచీ అతడేమైనా ప్రమాదాల్లో చిక్కుకుంటాడేమో అని ఆలోచించిందే తప్ప, తన ప్రేమ గురించి ఆలోచించలేదు.

ఆమె మనసంతా వాసిలేటింగ్‌గా తయారైంది. ఈ కొత్త సమస్య ఆమెని మరింత కృంగదీసింది. ఒకవేళ విహారేగానీ తన తండ్రి ఎటువంటి వాడో తెలిశాక కూడా ఆయన్నే సమర్థిస్తే .....

ప్రిన్సిపుల్స్ వేరు. జీవితం వేరు.

చాలా కొద్దిమందికి మాత్రమే వాటిమధ్య సయోధ్యకుదురుతుంది.

అయితే ప్రవల్లిక ఆ కొద్దిమందిలోనే వుంది.

ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. వేచి చూడటం ..... అదే ప్రస్తుతపరిస్థితుల్లో సరైన మార్గం.

ఒకసారి ఈ నిర్ణయానికి వచ్చాకా ఆమె ఇక తన ఆఫీసు విషయాలు గురించి ఆలోచించ సాగింది.

తన ఆఫీసు నుంచి ఎవరో రహస్యాల్ని బయటకు చేరవేస్తున్నారన్నది నిర్వివాదం. ముందు వాళ్ళని పట్టుకోవాలి.

దానికోసం ఆమె చిన్న ట్రిక్ ఉపయోగించదలచుకుంది.

అయితే ఆ ట్రిక్కే ఆమెని ప్రాణాపాయంలో పడేసింది.

* * *

'ఉద్యోగం పురుష లక్షణం' అన్న ప్రవల్లిక మాటలకి ప్రభావితుడయిన రోజు నుంచి ఇప్పటి వరకూ విహారి ఆఫీసు వ్యవహారాలన్నీ దాదాపు ఒక కొలిక్కి తీసుకొచ్చాడు. పరమేశ్వరం కొడుకుని అభినందించాడు.

"అన్నీ చాలా అప్ -టు-డేట్ చేశావే?"

"నెల - రెండు నెలల్లో చేశాడండి" అంది తల్లి పక్కనుంచి.

"నిజమా?"

"నిజమే నాన్నగారూ! అకౌంటింగూ, బేసిక్ ఇన్-కంటాక్స్ సిద్ధాంతాలూ మొదట్లో అర్థంకాలేదు. ఓ పదిరోజులు కష్టపడితే అంతా తెలిసిపోయింది."

విహారీ వెళ్ళిన తరువాత పరమేశ్వరం భార్యతో అన్నాడు. "నా కొడుకు ఇన్ని తెలివి తేటలున్నవాడు అవుతాడనుకోలేదు సుమా! మంచి క్రమశిక్షణతో పెంచావు."

"ఆ నాటకాలొక్కటే లేకపోతే ఇంకా బావుండేదండీ"

"ఏం తప్పేముంది? బాగా కష్టపడే ప్రతి మనిషికి రిలాక్సయే ద్వారం ఒకటుండాలని ఇంగ్లీష్‌లో ఒక సామెతుంది. నాటకాలాడటం ద్రోహమేమీ కాదే. అదొక హాబీ!"

ఆమాట విహారికి తెలిసి కదిలిపోయాడు. ఇన్నేళ్ళ జీవితంలో తన వాళ్ళలో ఒక్కరూ ఈ హాబీని మెచ్చుకున్నవాడు లేరు. తల్లితో సహా అందరూ విమర్శించేవారే "థాంక్స్ నాన్నగారూ అన్నాడు మెరుస్తున్న కళ్ళతో, ఇన్నాళ్ళకు మీరొక్కరు నన్ను సమర్థించారు."